క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన వైట్ల



తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌కు శ్రీ వేంకటేశ్వర స్వామి జ్ఞాపికను అందిస్తున్న కిషోర్

పెనుగొండ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వైట్ల కిషోర్ కుమార్ మర్యాద పూర్వకంగా కకలిసారు. బుధవారం తాడేపల్లిలోని జగన్‌మోహన్‌రెడ్డి నివాసంలోకలసి శ్రీ వేంకటేశ్వర స్వామి జ్ఞాపికను అందించారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ సీఎం జగన్ కోరారన్నారు. పార్టీ నాయకుల మనవర్తి విజయ్‌కుమార్, మేడిమెట్ల నరేష్ తదితరులు మాజీ సీఎం జగన్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి



ములపర్రులో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

పెనుగొండ: ప్రభుత్వ పథకాలు అందడానికి ప్రతి రైతూ వారి పంటకు ఈ క్రాప్ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని చినమల్లం, ములపర్రు గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. పంటల నమోదుపై రైతులతో సమీక్షించారు. మండలంలో 11700 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు చేశామన్నారు. ఈ-కేవైసీ సైతం 90 శాతం పూర్తయిందని వివరించారు. పంటల బీమాకు నమోదు కోసం ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పి.స్పందన, వీఆర్వో ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



గాంధీజీ చిత్రపటానికి వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర సంఘం సూచించిన దశల వారి పోరాటంలో భాగంగా మునిసిపల్ ఉపాధ్యాయ సమస్యలు తీర్చాలని యూటీఎఫ్ పట్టణ శాఖ అధ్యక్షుడు ఎస్.రాంజీకుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద గాంధీజీ చిత్రపటానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకేవీ రామభద్రం, జిల్లా సహాయ అధ్యక్షులు కె.రాజశేఖర్, రాష్ట్ర సభ్యులు పి.శ్రీనివాస్, పట్టణ గౌరవాధ్యక్షుడు జె.జయదుర్గారావు, సెక్రటరీ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో గ్రామాభివృద్ధి సాధ్యం



పెనుగొండలో ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులతో గ్రామాభివద్ధి ఎంతగానో జరుగుతుందని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి అన్నారు. బుధవారం పంచాయతీ ఆవరణలో ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పెనుగొండలో 2025-26 సంవత్సరంలో చేపట్టబోయే ఉపాధి పనులను గుర్తించడానికి తీర్మానం చేశారు. ఐదు సచివాలయాల సిబ్బంది వారి శాఖలకు సంబంధించి నివేదికలు సమర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి టి.రత్నాకరరావు తదితరులు పాల్గొన్నారు.

వడలిలో...

వడలిలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించి ఉపాధి పనులు గుర్తించడానికి తీర్మానం చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పీపీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి

భీమవరం: పట్టణంలోని లూథరన్ హై స్కూల్ ఆవరణలో ఎలీషా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బుధవారం యవనస్తుల కూడిక, నూతన సేవకులుగా ఎంపికైన వారి గ్రాడ్యుయేషన్ నిర్వహించారు. వీరంతా సత్ప్రవర్తనతోమెలగాలన్నారు. కార్యక్రమంలో బిషప్ వి సత్యం, బ్రదర్ పాల్, బ్రదర్ ఎం.జాషువా తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడి బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి

వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి



పాలకొల్లు అర్బన్ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహాత్ముని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)



పాలకొల్లు సెంట్రల్: పెదగరువు పాఠశాలలో గాంధీ, శాస్త్రిల జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: దేశ ప్రజలకు మహాత్మాగాంధీ చూపిన శాంతి, సౌభ్రాతృత్వం, సహనం తదితర లక్షణాలను నేటి తరం అలవరచుకుని ఆయన బాటలో నడవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. మండలంలోని యాళ్లవానిగరువు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గుడాల గోపి మహాత్ముని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పల్లెసీమలు అభివృద్ధి చెందితేనే భారతదేశం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని మహాత్మాగాంధీ కన్న కలలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆచరించి చూపారన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిన ప్రజల వద్దకు సంక్షేమ బాటలు వేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చేగొండి సూర్యప్రకాష్, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, పార్టీ నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు, బొడ్డేటి సూర్యనారాయణ, కర్రా జయసరిత, ఉచ్చుల స్టాలిన్, ఖండవల్లి వాసు, సన్నిశెట్టి లీలాభవన్నారాయణ, బాబి, బండి సుందరరామమూర్తి, పెచ్చెట్టి కృష్ణాజీ, నంబూరి గంగాపవన్, చెన్ను విజయ్, మామిడి బాబు, కొర్రగింజల శ్రీను, అద్దాల నారయ్య, పైలా రాజశ్రీ, రామాంజుల పెదమధు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు పట్టణంలో..

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో భారతదేశ మాజీ ప్రధానిలాల్ బహదూర్ శాస్త్రి, జాతిపిత మహాత్మా గాంధీల జయంతి వేడుకలు బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెదగరువులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యునైటెడ్ కాపు వనిత క్లబ్ మహిళలు పర్యావరణ పరిరక్షణలో భాగంగా పూలపల్లిలో మొక్కలు నాటారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం మరియు గాంధీబొమ్మల సెంటర్ వద్ద గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. కాపు క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు నవోదయ ఎంట్రెన్స్ పుస్తకాలు పంపిణీ చేశారు. జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు జై జవాన్ జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు. స్థానిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొత్త కుళాయి చెరువు గట్టు వద్ద గాంధీ జయంతి నిర్వహించారు. జనసేన ఆధ్వర్యంలో స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం, గాంధీబొమ్మల సెంటర్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఛాంబర్ డిగ్రీ కళాశాలలో గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు.

యలమంచిలిలో..

యలమంచిలి: మహాత్ముల ఆశయసాధనకు కృషి చేయడమే మనం వారికిచ్చే అసలైన నివాళని స్వాతంత్ర్య సమరయోధుడు పేరిచర్ల సుబ్బరాజు మనవడు పేరిచర్ల రవివర్మ అన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మట్లపాలెం హైస్కూల్ సెంటర్లో ఉన్న గాంధీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరాడంబరత, నిస్వార్థానికి మారుపేరైన గాంధీ ఆచరించిన శాంతి బాటలో నేటి యువత నడవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చల్లా లక్ష్మీ, మాజీ సర్పంచ్ చల్లా విశ్వేశ్వరరావు (నల్లయ్య), కడలి నరసింహస్వామి, ఇల్లింగి దశరథరామయ్య, కొండేటి శ్రీనివాస్, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆచంటలో..

పెనుగొండ: శాంతి మార్గంలో దేశానికి స్వాతంత్ర్యాన్ని సాధించిన మహోన్నత వ్యక్తి జాతిపిత మహాత్మాగాంధీ అని ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి అన్నారు. బుధవారం మహాత్మా గాంధీ జయంతి మహోత్సవాలు సందర్భంగా ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ప్రపంచానికి శాంతి మార్గాన్ని అందించిన ఘనత గాంధీజీకే దక్కుతుందన్నారు. యువత గాంధీజీని ఆదర్శంగా తీసుకొని శాంతి మార్గంలో నడవలాని పిలుపునిచ్చారు.

పెనుగొండలో

గాంధీ జయంతి సందర్భంగా పెనుగొండ పంచాయతీలో సర్పంచ్ నక్కాశ్యామలాసోనీ శాస్త్రి, వడలిలో కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, సిద్ధాంతంలో చింతపల్లి గనిరాజు(చంటి)లు జాతి పిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధికారులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

నరసాపురం: రిమాండ్ ఖైదీలు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చిని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు సూచించారు. బుధవారం గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా స్థానిక సబ్‌జైలులో నిర్వహించిన న్యాయ విజాన సదస్సులో ఆయన మాట్లాడుతూ జైలులో ఖైదీల సంక్షేమానికి ఎలాంటి లోటు పాట్లు లేకుండా చర్యలు చేపడతామని చెప్పారు. ఆర్థిక స్తోమలేని రిమాండ్ ఖైదీలకు బెయిల్, ఇతర సహాయం కోసం ఉచితంగా న్యాయవాది సహాయం చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని, నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. ముందుగా జడ్జిలు సబ్‌జైలు ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రీనివాస్, జైలు సూపరిండెంట్ టి.అప్పారావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చేగొండి బాలాజీ పాల్గొన్నారు.

బీజీబీఎస్ మమహిళా కళాశాలలో

బీజీబీఎస్ మహిళా కళాశాలలో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ కె.రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు. వైఎస్ కళాశాలలో గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుక నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. పట్టణంలో శాంతి ర్యాలీ చేశారు. కళాశాలలో 7 ఆంధ్రా నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో, మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ ఆధ్వర్యంలో వేడుక జరిగింది. మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాన మంత్రి లాల్‌బహదూర్ శాస్త్రిల జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని 17 గ్రామాల్లోనూ ఆయా పంచాయతీ కార్యాలయాల్లో గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. మొగల్తూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పడవల మేరీ గాంధీ, లాల్‌బహదూర శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జగన్నాథపురంలో సర్పంచ్ సరిపల్లి శ్రీలక్ష్మీ హర్షిత, జడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ తదితరులు గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోణం నర్సింహరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కైలా సుబ్బారావు, పడవల సత్యనారాయణ, వార్డు సభ్యులు మెట్ల రాంబాబు, మద్దూరి పెద్దిరాజు, కొండా ఆదాము, లింగం అరుణ, ఎర్రమిల్లి గణపతి పాల్గొన్నారు.

భవిష్యత్ తరాలకు ఆదర్శం



లేస్ ట్రేడ్ సెంటర్‌లో పరిశుభ్రతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: భవిష్యత్ తరాలకు గాంధీ ఆదర్శమని ప్రపంచ శాంతికి మానవ మనుగడకు గాంధీ సిద్ధాంతాలే శరణ్యమని ఎంపీపీ మైలాబత్తుల సోని, ఎంపీడీఓ కేవీ వీరభద్రరావులు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీ జయంతిలో వారు పాల్గొని మహాత్మునికి ఘనంగా నివాళులర్పించారు. అలాగే తూర్పుతాళ్లు సచివాలయం వద్ద బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిరం బ్రహ్మం, కంచర్ల సోని, కోట్ల సుధాకర్, పల్లపోతు రాము, శ్రీరంగనాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే రుస్తుంబాద గ్రామంలోని అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్ వద్ద కన్వీనర్ కలవకోలను తులసి అధ్యక్షతన నిర్వహించిన గాంధీ జయంతి కార్యక్రమంలో సర్పంచ్ బందెల రవీంద్ర భారతీ మహాత్మునికి ఘనంగా నివాళులర్పించారు. గ్రామంలోని లెప్రసీ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు.



యలమంచిలి: మట్లపాలెంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేస్తున్న గ్రామ పెద్దలు



ఆచంట: ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ సూర్యకుమారి



నరసాపురం: గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ చేస్తున్న దృశ్యం



మొగల్తూరు: పంచాయతీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సర్పంచ్ పడవల మేరీ, వార్డు సభ్యులు

ఉద్యోగులకు స్వచ్ఛత హీ సేవా పురస్కారాలు



కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గుడాల హరిబాబు

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య విస్తరణాధికారిగా పనిచేస్తున్న గుడాల హరిబాబుకి స్వచ్ఛత హి సేవా అవార్డు లభించింది. ఈ అవార్డును భీమవరం కలెక్టరేట్ ఛాంబర్‌లో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ చదవలవాడ నాగరాణి, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు చేతుల మీదుగా ఈ అవార్డును హరిబాబు అందుకున్నారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా పాలకొల్లు మండలంలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించడం, ర్యాలీ నిర్వహించడం, మొక్కలు నాటించడం తదితర కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినందుకు అవార్డు అందుకున్నట్లు హరిబాబు విలేకరులకు తెలిపారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అటువంటి కృషి చేస్తున్న వీరి సేవలు అభినందనీయమని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కొనియాడారు. గత నెలలో పేరుపాలెం బీచ్ తీరంలో స్వచ్ఛ సాగర్-సురక్షిత సాగర కార్యక్రమం నిర్వహించిన ఇంక్వాయిస్ సంస్థకు చెందిన శాస్త్రవేత్త బుర్ర శివయ్య, మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శ్రీనివాస అర్జున్ కుమార్‌లకు బుధవారం గాంధీ జయంతి కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, జిల్లా కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యేలు శాలువా కప్పి ప్రశంసా పత్రాలను అందించారు. అయితే శాస్త్రవేత బుర్ర శివయ్య హాజరుకాని కారణంగా ఆయన సతీమణి శ్రీమతి సూర్యకుమారికి ప్రశంసా పత్రాన్ని అందించారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పశంసా పత్రాన్ని అందుకుంటున్న చెరుకువాడ విద్యార్థులు

ఉండి: భీమవరంలో నిర్వహించిన స్వచ్ఛత దివస్ కార్యక్రమంలో ఉండి మండలం చెరుకువాడ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించినట్లు ఉపాధ్యాయుడు గోపాల సుకుమార్ తెలిపారు. హెచ్ఐవీఎయిడ్స్‌లపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో చెరుకువాడ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు డి.మోషే కరణ్, జె.శ్రీనివాస్ ప్రథమ స్థానం సాధించారు. బుధవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసా పత్రాలను అందించారు.

చెత్త నుంచి సంపద కేంద్రాల నిర్వహణ అధ్వానం



యలమంచిలి మండలం మేడపాడులో నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రం

యలమంచిలి: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ చెత్తగా ఉంది. ఫలితంగా అవి నిరుపయోగంగా మారాయి. లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. యలమంచిలి మండలంలో 32 గ్రామాలుండగా 30 గ్రామాల్లో సంపద కేంద్రాలను నిర్మించారు. అయితే చాలా కేంద్రాలు రవాణాకు అనువైన చోట నిర్మించికపోవడంతో నిర్మాణం పూర్తయిన నాటి నుంచి నేటి వరకు వినియోగించకుండా ఉన్న కేంద్రాలు కూడా ఉన్నాయి. కంచుస్తంభంపాలెం గ్రామంలో గోదావరి ఒడ్డున చెత్త సంపద కేంద్రం నిర్మించారు. 2022లో వచ్చిన వరదకు ఈ కేంద్రం గోదావరిలో కలిసిపోయింది. నిర్మించిన 30 కేంద్రాల్లో ఒకటి అర మినహా అన్ని కేంద్రాలు నిరుపయోగంగానే ఉన్నాయి. ఒక్కో కేంద్రం నిర్మాణానికి సగటున రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు నిధులు వినియోగించారు. గ్రీన్ అంబాసిడర్లను నియమించి పంచాయతీల్లో సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి తడి, పొడి చెత్తగా వేరు చేసి తడి చెత్తతో సేంద్రియ ఎరువులు తయారు చేయడం తోపాటు పొడి, ప్లాస్టిక్ వ్యర్థాలను అమ్మి సంపద సృష్టించడమే లక్ష్యంగా ఈ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే నిర్లక్ష్యం, నిర్వహణ లోపం వల్ల లక్ష్యం నెరవేరలేదు ఆయా కేంద్రాలు చుట్టూ పిచ్చిమొక్కలు మొలిచి అసాంఘిక కార్యకలాపాలకు వేదికవుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఈ కేంద్రాలను వినియోగంలోనికి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉంటే సంపద కేంద్రాలకు చెత్తను తరలించే గ్రీన్ అంబాసిడర్లకు ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదు. వేతనం గురించి సంబంధిత అధికారులను అడిగితే ప్రభుత్వం విడుదల చేయాలని చెబుతున్నారని, ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి మా జీతాలివ్వాలని గ్రీన్ అంబాసిడర్లు కోరుతున్నారు.

> **కేంద్రాల పనితీరు మెరుగుపరుస్తాం**
>
> చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పని తీరును మెరుగు పరుస్తాం. ఇళ్లలో సేకరించిన చెత్త చెదారాన్ని కేంద్రాలకు తీసుకెళ్లి సేంద్రియ ఎరువులు తయారు చేస్తాం. సంపద సృష్టించేలా చర్యలు చేపడతాం. గ్రీన్ అంబాసిడర్లకు వేతనాలు త్వరలోనే చెల్లిస్తాం.
>
> – షరీఫ్, ఈఓపీఆర్డీ యలమంచిలి

గ్రామ సభల ద్వారా ఉపాధి పనుల గుర్తింపు



ఆరేడు గ్రామ సభలో మాట్లాడుతున్న ఒమేగరాజు

ఉండి: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను మహాత్ముని జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన గ్రామ సభల ద్వారానే గుర్తించినట్లు ఎన్ఆర్ఈజీఎస్ మండల టెక్నికల్ అసిస్టెంట్ లంకపల్లి ఒమేగరాజు అన్నారు. బుధవారం మండలవ్యాప్తంగా 19 గ్రామాల్లోను పంచాయితీ కార్యాలయాల వద్ద గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరేడు గ్రామ సభలో పాల్గొన్న ఒమేగరాజు మాట్లాడుతూ పనులు గుర్తించడం, వేతనదారులకు పని కల్పిస్తామన్నారు. రైతులకు ఉపయోగపడేలా పంట, మురుగు బోదెలను శుభ్రం చేయడం, హార్టీకల్చర్ పండ్ల తోటలు పెంపకానికి పశువుల షెడ్లు, గొర్రెల షెడ్లు నిర్మించుకోవడానికి ఉపాధి హామీ ద్వారా రైతులకు హామీ కల్పిస్తామన్నారు. గ్రామ సభల్లో ఆమోదించిన పనులు ప్రాధాన్యత క్రమంలో ప్రణాళికాబద్ధంగా చేపడతామన్నారు. కూలీలకు పని కల్పిండమే ధ్యేయంగా ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కట్రెడ్డి బ్రహ్మానందం పాల్గొన్నారు.


రఘునాథరాజు చిరస్మరణీయుడు

ఆకివీడు: వైద్యాన్ని పేదలకు అందుబాటులోకి తెచ్చి,కొల్లేరు తీర ప్రాంత ప్రజలతో పాటు స్థానిక ప్రజలకు అతి తక్కువ ఫీజులతో వైద్య సేవలందించిన డాక్టర్ మందపాటి రఘునాథరాజు సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక ఎస్ టర్నింగ్ వద్ద రఘునాథరాజు ఆరో వర్ధంతి కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామరాజు వేర్ హౌసింగ్ అధినేత కేఆర్‌కే మూర్తిరాజు ఆర్థిక సహకారంతో పేదలకు చీరలు, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, ప్రసాద్, సత్తిబాబు, అజయ్,కన్నప్ప, శ్రీను, కిమిడి లక్ష్మణ్, జమ్ము శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల వద్ద గ్రామ సభలు

వీరవాసరం: మండల వ్యాప్తంగా ఉన్న గ్రామ సచివాలయాల వద్ద గ్రామ సభలను బుధవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు పోరాటానికి సిద్ధం



సిద్ధాంతంలో సీపీఎం అధ్యయన తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ఆంధ్రుల హక్కుగా ఉన్న విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణకై మరో చారిత్రాత్మక పోరాటినికి సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపు నిచ్చారు. బుధవారం సిద్ధాంతంలోని ఆర్కే పంక్షన్ హాలులో సీపీఎం జిల్లా స్థాయి అధ్యయన శిబిరంలో పాల్గొన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ రాష్ట్రానికి ఆయువు పట్టుగా ఉన్న కేంద్ర పరిశ్రమైన విశాఖ ఉక్కును ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తుందని విమర్శించారు. కేంద్రాన్ని ప్రశ్నించాల్సిన రాష్ట్ర ప్రాంతీయ పార్టీలు మౌనం వహించడం అన్యాయమన్నారు. రాజకీయ స్వలాభం కోసం ఉక్కు పరిశ్రమను తాకట్టు పెడుతున్నారన్నారు. ప్రైవేట్‌పరం చేయమని ప్రచారం చేస్తూనే అన్ని విధాలా నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఇటీవలకాలంలో నాలుగు వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు గేట్ పాస్ రద్దు చేయడమే నిదర్శనమన్నారు. అంతేకాకుండా ఉద్యోగులను బలవంతంగా బదిలీలు చేయడం తగదన్నారు. స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఎందరో ఆత్మ త్యాగంతో విశాఖ ఉక్కు నిర్మితమైందని గుర్తు చేశారు. అలాంటి ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోవడానికి ప్రజలందరూ మరో చారిత్రాత్మక పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ఉచిత ఇసుక హామీ అమలు చేయాలి

ఉచిత ఇసుక హామీని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరాం డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చిన టీడీపీ కూటమి అమలు చేయలేక పోయిందన్నారు. ఇసుక పాలసీలో గత ప్రభుత్వాలకు, ఇప్పటి ప్రభుత్వానికి తేడాల లేదాన్నారు. ప్రభుత్వం చెప్పేదానికి, ఆచరణకు సంబంధం లేకుండాపోతుందన్నారు. ఇసుక రేట్లు గతం కంటే తగ్గకపోగా, అధికంగా పెరిగాయన్నారు. దీంతో నిర్మాణం రంగం కుదేలైందన్నారు. కార్మికులు ఉపాధి కరువైందన్నారు. ఉచిత ఇసుక హామీ అమలుకు 4న రాష్ట్ర వ్యాప్తంగా, 5న జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టనున్నటు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కేతా గోపాలన్, చింతకాయల బాబూరావు, పీవీ ప్రతాప్, కౌరు పెద్దిరాజు, జిల్లా కమిటీ సభ్యులు సూరిన్డి వెంకటేశ్వరరావు, పుగాకు పూర్ణ, జక్కంశెట్టి సత్యనారాయణ, జవ్వాది శ్రీనివాస్, మామిడిశెట్టి రామాంజనేయులు. పోడూరు మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.